రెండేళ్లుగా ఎదురు చూపులే

● 'అసంపూర్తిగా' ఆరోగ్య ఉప కేంద్రం
● రూ.21.50 లక్షలు వెచ్చించినా.. పూర్తికాని వైనం!



లోయపల్లి ఆరోగ్య ఉప కేంద్రం

మంచాల: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పే పాలకులు.. ఆచరణలో అమలు చేయలేక పోతున్నారు. మంచాల మండల పరిధి లోయపల్లిలో రెండేళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులు మొదలు పెట్టినా.. నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలో మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆరుట్ల పీహెచ్‌సీ పరిధిలో రంగాపూర్, బోడకొండ, బండలేమూర్, చెన్నారెడ్డి గూడ, లోయపల్లి సబ్ సెంటర్లు ఉన్నాయి. ఐదు సబ్ సెంటర్లలో బోడకొండ, రంగాపూర్, లోయపల్లి సబ్ సెంటర్లకు ప్రత్యేకంగా భవనాలు మంజూరు అయ్యాయి. వాటిలో రంగాపూర్ సబ్ సెంటర్‌కు ప్రత్యేక భవన సదుపాయం కల్పించారు. బోడకొండలో సబ్ సెంటర్ నిర్మాణం పూర్తయింది.

అద్దె ఇంట్లో ఆరోగ్య కేంద్రం

లోయపల్లిలో 2022 ఫిబ్రవరిలో విడతలుగా రూ.21.50 లక్షలు వెచ్చించి ఆరోగ్య ఉప కేంద్రం పనులు ప్రారంభించినా.. నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. మొదటి విడతగా మెడికల్ డిపార్ట్‌మెంట్ నిధుల నుంచి రూ.16లక్షలు మంజూరు అయ్యాయి. నిర్మాణ పనులు గోడల వరకు పూర్తి అయింది. అసంపూర్తిగా ఉండడంతో.. మరోసారి ఎండీఎస్ నిధులు రూ.5.50లక్షలు మంజూరయ్యాయి. అయినా నిర్మాణం పూర్తి కాలేదు. ఈ సబ్ సెంటర్ నిర్వహణ కోసం ప్రభుత్వం పల్లె దవాఖానలో భాగంగా అనిఫా అనే వైద్యురాలిని నియమించింది. భవనం పూర్తికాక పోవడంతో ఆమె అద్దె ఇంట్లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు, పాలకులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్రం భవనం పనులు పూర్తిచేయించి, వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై పంచాయతీ రాజ్ డీఈఈ అబ్బాస్‌ను వివరణ కోరగా.. అప్పట్లో బిల్లులు ఆలస్యం కావడంతోనే పనులు నిలిచిపోయాయని, త్వరలోనే పూర్తి చేయిస్తామని తెలిపారు.

రెండేళ్లు కావొస్తుంది



లోయపల్లి గ్రామంలో సబ్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లు అయింది. రెండు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వలనే పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయించి, వినియోగంలోకి తేవాలి.

– బొట్టు ప్రవీణ్ నాయక్, లోయపల్లి

దారి ఇలా.. వెళ్లేది ఎలా?



తుమ్మలకుంట తండా–దేవుని పడకల్ గేట్ రోడ్డు దుస్థితి

తలకొండపల్లి: మండల పరిధి తుమ్మలకుంట తండా–దేవుని పడకల్ గేట్ సమీపంలోని సింగిల్ బీటీరోడ్డు అధ్వాన్నంగా మారింది. వరుస వర్షాలకు బీటీ కొట్టుకుపోయి.. రోడ్డంతా గుంతలు ఏర్పడి, వాటిల్లో నీరు నిలిచింది. దీంతో ఈ మార్గం గుండా వాహనాలపై కాదుకదా.. కనీసం కాలి నడకన వెళ్లలేని దుస్థితి ఉందని ప్రాంత ప్రజలు తెలిపారు. కల్వర్టు కూడా కూలిపోయిందని పేర్కొన్నారు. కడ్తాల్–కల్వకుర్తి ప్రధాన రహదారి కావడంతో ఈ దారిలో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయన్నారు. సెలవు దినాల్లో కడ్తాల్ మండలంలోని మైసిగండి మైసమ్మను దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని వెల్లడించారు. ఈ ప్రాంతంలో డబుల్ రోడ్డుకు ప్రతిపాదన ఉన్నప్పటికీ.. అటవీ భూమి కావడంతో ఆ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో ఆగిపోయిందని వివరించారు. సుమారు కిలో మీటర్‌కు పైగా ఉన్న ఈ రోడ్డు మొత్తం గుంతల మయంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించడంతో పాటు.. కల్వర్టును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రాంతీయులు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ప్రారంభం



అన్నమాచార్య సంకీర్తనలో భక్తులు, నాయకులు

కడ్తాల్: సత్యసాయి మందిరంలో శ్రీ లలితా పరమేశ్వరి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్త్రీశక్తి లలితాంబిక బృందం, సాయి మందిర దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో.. దేవాలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, దీక్షాధారణ, శోడశ స్తంభ పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, కలశ స్థాపన, అర్చన, హారతి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నమాచార్య సంకీర్తనాచార్యులు, రాష్ట్రపతి సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో అన్నమాచార్య సంకీర్తన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నిర్వాహకులు ఎలికంటి జ్ఞాన ప్రసూనాంబ శర్మ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, భజన మండలి సభ్యుడు వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, నారాయణ, రాఘవాచారి, శ్రీనివాస్, లలితాంబిక బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, భక్తులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ రూ.15 లక్షలతో పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బుధవారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో యజ్ఞ హోమం, అఖండ దీపారాధన, ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఇరువురిని సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమం అనంతరం రూ.5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు, సీనియర్ నేత బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, మాజీ సర్పంచ్ లలిత, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, సీనియర్ నేత యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న డిపో మేనేజర్ వెంకట నర్సప్ప

ఇబ్రహీంపట్నం రూరల్: చదువుకుంటేనే భవిష్యత్తు అని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప అన్నారు. పట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో విద్యార్థులకు దాతల సహకారంతో ఉచిత బస్ పాసులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆయన అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్, సామాజిక సేవకులు బిక్షపతి పాల్గొన్నారు.

'అతివకు అండగా' కథనానికి అభినందనలు



పాఠశాల నోటీస్ బోర్డుకు పేపర్ క్లిప్పింగ్‌ను అతికిస్తున్న విద్యార్థినులు

మాడ్గుల: 'అతివకు అండగా..' కార్యక్రమానికి వినూత్న స్పందన లభిస్తోంది. వరుసగా 'సాక్షి'లో ప్రచురిస్తున్న వార్తా కథనంలో మీ సమస్యలను తెలపండి అని పేర్కొన్న ఫోన్ నంబర్లను.. బుధవారం మాడ్గుల మండలం ఇర్విన్ పాఠశాలలో విద్యార్థినులు నోటీస్ బోర్డుపై అతికించారు. దీంతో 'సాక్షి' చేపట్టిన కార్యక్రమానికి బోధన సిబ్బంది, విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే.. ఎలాంటి వ్యాధులు సోకవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధి వెంకట్రావ్‌పేట్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్తంగా 236 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతు నొప్పి, కళ్ల మంటలు, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా.. వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హైమావతి, రమేష్, ఈశ్వర్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, రఘురాములు, వెంకట్‌రెడ్డి, మైసయ్య, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, రాజు, దశరథం, లాల్, భాస్కర్, రాము, అంజయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● భోజనంలో నాణ్యత పాటించాలి
● మండల ప్రత్యేక అధికారి ముత్యాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

తలకొండపల్లి: ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక దృష్టిని సారించి, వెనుకబడిన వారిని ఏ గ్రేడ్‌కు వచ్చే విధంగా తీర్చి దిద్దాలని మండల ప్రత్యేక అధికారి ముత్యాలు అన్నారు. నాణ్యతతో కూడిన విద్యను అందించి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలే చూడాలని సూచించారు. మండల కేంద్రం కేజీబీవీ పాఠశాలను ఎంపీడీఓ శ్రీకాంత్‌తో కలిసి ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతంతో పాటు, భోజన ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం ముత్యాలు మాట్లాడారు. పది పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చిన్నారులకు సూచించారు. ఏ రోజు పాఠాలను ఆ రోజే చదువు కోవాలని, అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని, తాజా కూరగాయలతో వంటకాలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. వేడి ఆహార పదార్థాలనే వడ్డించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

ఎంఈఓ సర్దార్ నాయక్



క్రీడాకారులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కడ్తాల్: క్రీడాకారులు పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి ఎదగాలని ఎంఈఓ సర్దార్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఫార్చ్యున్ బటర్‌ఫ్లై సిటీ క్రీడా మైదానంలో జరుగుతున్న ఫ్రీడం కప్ జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రికెట్ సెలక్షన్ క్రీడలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. క్రీడలతో శారీరక వ్యాయామంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు జోనల్ స్థాయిలో ప్రతిభ చూపి, జిల్లా స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జంగయ్య, ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ కార్యదర్శి భీముడు, ఉపాధ్యాయులు మల్లయ్య, పాండు, రామకృష్ణ, రాధ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే భవిష్యత్తుకు పునాది



మాజీ వీసీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఇబ్రహీంపట్నం రూరల్: క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుందని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సిలర్, ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. పట్నం సమీపంలోని వినోభనగర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాతో సమయాన్ని వృథా చేసుకోకుండా.. పాఠ్యంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పాఠ్యాంశాలతో పాటు ప్రయోగాత్మక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ నాగయ్య, సెక్రెటరీ డాక్టర్ డీ.ప్రదీప్ కుమార్, ప్రిన్స్‌పాల్ డాక్టర్ శేఖర్‌బాబు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి**

హయత్‌నగర్: వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలమండ్ల గోవర్ధన్ కోరారు. వీహెచ్‌పీఎస్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన హయత్‌నగర్‌లో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు.

◆ **వంతెనకు మోక్షం**

ఇబ్రహీంపట్నం రూరల్: రాయపోల్ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే రంగారెడ్డి మోక్షం కల్పించారని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. వంతెన లేని కారణంగా.. మండల పరిధి సూర్యోదయ కాలనీ, మందగూడ వైపు వెళ్లేదారిలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని చెప్పారు. ఈ నేపథ్యంలో పట్నం ఎమ్మెల్యే.. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణంతో ఆ కష్టాలు దూరం కానున్నాయన్నారు.

◆ **తాగునీటి సమస్యను పరిష్కరించాలి**

ఇబ్రహీంపట్నం రూరల్: రాయపోల్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్నం ఎంపీడీఓ వెంకటమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. 25 రోజులుగా గ్రామానికి తాగునీరు రావడం లేదని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులు చొరవ తీసుకుని ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాలని కోరారు.

◆ **భక్తుల సౌకర్యార్థం..**

తలకొండపల్లి: బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసర ప్రాంతంలో తగిన ఏర్పాట్లు చేయిస్తున్నానని మాజీ సర్పంచ్ శ్రీశైలం అన్నారు. మండల పరిధి దేవుని పడకల్‌లో గురువారం పోచమ్మ బోనాల పండుగ జరగనుంది. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఆలయంలో విద్యుత్ సరఫరాకు కావాల్సిన ఏర్పాట్లతో పాటు, ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చారు.

◆ **రావిచేడ్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి**

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో చిన్నారులు ఉట్టికొట్టారు. ఇందులో పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహకంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోపాల్.. రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

◆ **విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు**

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ఉచితంగా బస్ పాసులు అందజేయడం అభినందనీయమని కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. బుధవారం ఆమె పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ అధికారులతో కలిసి బస్ పాసులు పంపిణీ చేశారు. ఇందులో ఆర్టీసీ డీఎం వెంకట నర్సప్ప, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, జ్యోతి ఉన్నారు.

◆ **గురుకుల పాఠశాల సందర్శన**

ఆమనగల్లు: షాబాద్ మండల కేంద్రంలోని ఆమనగల్లు బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఎంపీడీఓ కుసుమ మాధురి సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, స్నానాల గదులు, వంటశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడగా.. పలు సమస్యలు ఆమె దృష్టికి తెచ్చారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్నానాల గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ఆమనగల్లులో నూతన భవనం నిర్మించి ఈ పాఠశాలను అక్కడికి మార్చాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీఓ చెప్పారు. ఇందులో పాఠశాల ప్రత్యేకాధికారి వినోలా ఉన్నారు.

క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కడ్తాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధి రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.11 వేలను ఉపాధ్యాయులకు ఆయన అందజేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని, విద్యార్థులు క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు బీరప్ప, శ్రీశైలం, కృష్ణయ్య, యాదయ్య, సాయికుమార్, హెచ్‌ఎం స్వరూప, పీడీ సాబేర్ ఉపాధ్యాయులు అశోక్, సతీశ్, రమేశ్, మంజుల, వినోద్, శ్రీదేవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్త



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

యాచారం: గుర్తు తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఊరికి వెళ్లేటప్పుడు చోరీలు జరగకుండా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ కూడలి, మొండిగౌరెల్లి చౌరస్తా తదితర కూడళ్లల్లో పోలీస్ సిబ్బంది సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గంజాయి తాగడం, విచ్చలవిడిగా మద్యం సేవించడం, మహిళలను ఇబ్బంది పెట్టే సంఘటనలు జరిగితే ఫిర్యాదు చేయాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కలశ దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కనకదుర్గ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రముఖ సంఘ సేవకుడు పగడాల ముత్తు దర్శించుకుని, పగడాల కనకయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయానికి కలశం సమర్పించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్, మహేందర్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, జగన్, యాదిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థి తదితరులు

తలకొండపల్లి: తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనందించి, వారి ఉన్నత చదువులకు సహకారం అందజేస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్న ఆయన.. బుధవారం ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా రూ.50 వేలను విరాళంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సిలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో లయన్ అంజయ్య, ఓంకారం, జూలూరి రమేష్, శ్రీనివాసురెడ్డి, అంజయ్య సార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం

కడ్తాల్: జర్పుల శాంతి–పాండు దంపతుల కూతురు గీత వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం చేసింది. బుధవారం మండల పరిధి పోచమ్మగడ్డ తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ రూ.21 వేలతో పాటు పట్టు చీరను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు శారద దశరథ్, నాయకులు శంకర్, కిషన్, జగన్, వినోద్, చిత్ర, లక్ష్మీ, సోనా తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో బోనంతో యువతి



యాచారం: కుర్మిద్దలో సోమన్న బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు



కడ్తాల్: మైసిగండిలో బోనంతో మహిళ

వైభవంగా బోనాలు

ఆమనగల్లు/ కడ్తాల్: తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక అని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పలువురు నాయకులు అన్నారు. బుధవారం ఆమనగల్లు మండల కేంద్రంలో పోచమ్మ, కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో మైసమ్మ తల్లికి భక్తులు బోనం ఎత్తారు. ఈ సందర్భంగా నెత్తిన బోనంతో మహిళలు.. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో డప్పుచప్పుళ్ల నడుమ అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అనంతరం ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నైవేద్యంగా దేవతలకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో పల్లెలు చల్లగా ఉండేలా చూడు తల్లి అని మొక్కుకున్నారు



కడ్తాల్: మైసిగండిలో..



ఆమనగల్లు: బోనాల ఊరేగింపు